క్లుప్తంగా

పాఠశాలకు బెంచీల వితరణ



పాఠశాలకు బెంచీలను అందించిన పూర్వ విద్యార్థులు

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు ఆదివారం ఈ పాఠశాలలో చదివిన 1988–89 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు 18 బెంచీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులకు పాఠశాల అభివృద్ధికి తమ బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ వంతు సాయం చేస్తామన్నారు. ఉపాధ్యాయులు అడిగిన మేరకు బెంచీలను అందించామన్నారు.

కొండాపురంలో రైళ్లు ఆపండి



రైళ్లు ఆపాలని రైల్వే అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాలు

కొండాపురం : కొండాపురంలో అన్ని రైళ్లు ఆపాలని సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు శనివారం రైల్వేస్టేషన్‌లో ప్రజాసంఘాల నాయకులతో కలసి రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేశారు. గతంలో కరోనా నేపథ్యంలో కొండాపురం రైల్వేస్టేషన్‌లో ఆగే అన్ని రైళ్లను రద్దు చేశారని వాటిని పునరుద్ధరించాలని లేని పక్షంలో పెద్దఎత్తున ధర్నాలు చేపడుతామన్నారు.

కుర్చీలు, దుప్పట్లు వితరణ

జమ్మలమడుగు : స్థానిక ప్రభుత్వాసుపత్రికి శనివారం కుర్చీలు, స్టూల్స్, దుప్పట్లను దేవగుడి ట్రస్టు తరపున వితరణ చేశారు. ఉదయం టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి ఆసుపత్రి సూపరింటెండెంట్ రఫీక్‌పాషాకు అందించారు. కార్యక్రమంలో ఎన్‌డీఏ కూటమి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే

చింతకొమ్మదిన్నె : నాగిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులకు విద్యా కిట్లను ఎమ్మెల్యే పి.కృష్ణ చైతన్యరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే అయ్యాక మొదటి కార్యక్రమం విద్యార్థులకు విద్యా కిట్లను అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్తపరీక్షల కిట్లు పంపిణీ



రక్తపరీక్షల కిట్లను వైద్యులకు అందజేస్తున్న అధికారి సిద్ధయ్య

సింహాద్రిపురం : సింహాద్రిపురం, బిదినంచెర్ల, కోవరంగుట్టపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మలేరియా, డెంగ్యూ నిర్ధారణ చేయు పరీక్షల కిట్లు, దోమల నివారణకు సైపనోత్రిన్, లార్వా నివారణ కొరకు అబేట్, బిటీఐ పారాసిటమాల్ మాత్రలను శనివారం సబ్‌యూనిట్ అధికారి సిద్ధయ్య వైద్యులకు అందజేశారు. 10 రోజుల నుంచి వర్షాలు పడుతుండటంతో ముందు జాగ్రత్త చర్యగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మలేరియా, డెంగ్యూ, లార్వా నివారణ, దోమల నివారణకు సంబంధించిన మందులు, రసాయనాలు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఎవరికైనా జ్వరం వచ్చినట్లైతే ప్రతి ఆశా కార్యకర్తవద్ద మలేరియా నిర్ధారణ చేయించుకోవాలని, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు ప్రతీ ఎంఎల్‌హెచ్‌పీల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు.

ఆనకట్టపై బ్యారేజ్ నిర్మించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని ఆదినిమ్మాయపల్లె ఆనకట్టపై బ్యారేజీని నిర్మించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి కోరారు. శనివారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆది నిమ్మాయపల్లి ఆనకట్టపై బ్యారేజ్ నిర్మించాలని ఆందోళన కార్యక్రమం పెడితే ప్రస్తుతం కడప పార్లమెంటు అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి ఆదినిమ్మాయపల్లి ఆనకట్ట వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొని హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా కడప ప్రజల చిరకాల కోరిక అయిన కడప ఉక్కు పరిశ్రమను స్థాపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కడప, కమలాపురం ఎమ్మెల్యేలు ఎక్కువగా శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు లింగమూర్తి, మగ్బూల్ బాష తదితరులు పాల్గొన్నారు.

అనధికార ఆర్వోప్లాంట్‌లతో నాణ్యతలేని మంచినీరు

- నాణ్యత తనిఖీ చేయని అధికారులు
- కరోనాతో పెరిగిన శుద్ధినీటికి ప్రాధాన్యత



ఆర్వో ప్లాంట్ (ఫైల్)

ఎర్రగుంట్ల : మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు పది లీటర్ల నీరు తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. 60 శాతం రోగాలు మంచినీరు తీసుకోకపోవడం వల్లే వస్తున్నాయని సర్వేలో వెల్లడైంది. ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలో మంచి నీరు కావాలంటే ఫ్లోరైడ్ నీరు దిక్కు.... దీనిని అధికమించేందుకు ఇళ్ల వద్దకు ఆటోల్లో వస్తున్న మినరల్ వాటర్‌ను అధిక ధరతో కొనుగోలు చేస్తున్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని ఆర్వో ప్లాంట్లలో ప్రభుత్వం గుర్తింపు లేకుండా, ఐఎస్‌ఐ గుర్తింపు లేకుండా తయారువుతున్న నీటిలో సురక్షితం ప్రశ్నార్థకంగా మారింది. అనధికారంగా వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుసున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో 20 లీటర్ల నీటి తయారికి రూ.2 ఖర్చు అవుతుంది. ఇళ్లకు రూ.10, కూల్‌వాటర్ అయితే రూ.20కి విక్రయిస్తున్నారు. ఫ్లోరైడ్ నీటితో బాధపడుతున్న ప్రజలు ఆర్వో ప్లాంట్లలో తయారయ్యే నీటిని తాగితే బాగుంటుందన్న నమ్మకాన్ని వాటర్ ప్లాంట్ల యజమానులు సొమ్ము చేసుకుంటున్నారు.

నిబంధనలు గాలికి..

సాధారణంగా ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలంటే పంచాయతీ, మున్సిపాలిటీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఐఎస్‌ఐ మార్క్‌తో ఆర్వో వాటర్ ప్లాంట్ పెట్టాలంటే కనీసం రూ.12 లక్షలు నుంచి రూ.14 లక్షలు ఖర్చు అవుతుంది. ఇందులో ఐఎస్‌ఐ మార్కు కోసం వాటర్ ప్లాంట్ మిషన్‌తో కలపి రూ.4 లక్షలు దాక ఖర్చు వస్తుంది. గంటకు 2 వేల లీటర్ల నీటిని శుద్ధి చేయవచ్చు. 60–40 సైజుతో షెడ్‌ను కూడా ఏర్పాటు చేసుకోవాలి. ఇంకా హీటర్, మెమరి, తదితర వస్తు సామగ్రిని సమకూర్చుకోవాలి. నీటి పరీక్ష చేసేందుకు శిక్షణ పొందిన సూపర్‌వైజర్లను నియమించుకోవాలి. ఆచరణలో ఇవేమీ పాటించలేదు. రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వ్యయంతో ప్రభుత్వ అనుమతి లేకుండా ఆర్వో ప్లాంట్ల పేరుతో నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎందుకంటే వీధికి ఒక వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. వీటిలో ఏఏ వాటికి ఐఎస్‌ఐ అనుమతులు ఉన్నాయో అధికారులకే తెలియదు. పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు ఏర్పాటవుతున్నా అధికారులు తనిఖీలు నామమాత్రంగా కూడా లేవు.

శుద్ధి నీరు అంటే..

ఒక లీటర్ నీటిలో కాల్షియం 75 మి.లీ గ్రాములు సల్ఫేడ్ 200 మి.లీ గ్రాములు, క్లోరైడ్స్ 250 మి.లీ గ్రాములు, ఇనుము 0.3 మి.లీ గ్రాములు, క్లోరిన్ 0.2 మి.లీ గ్రాములు, ఫ్లోరైట్ 1.0 మి.లీ గ్రాములు ఉండాలి. ఈ ప్రమాణాలు పాటించకుండానే నీటి శుద్ధి కేంద్రాల నిర్వాహకులు నీటిని ప్రజలకు విక్రయిస్తున్నారు.

ఫ్లోరైడ్ నీటితో వచ్చే వ్యాధులు

సాధారణంగా నీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉంటుంది. దీని వల్ల ఎముకల పటుత్వం తగ్గి కీళ్ల వాతం, కాళ్లు వంకర తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. చిన్న పిల్లలు తాగితే చిన్న వయస్సులోనే పండ్లపై గార, కాళ్లు చేతులు వంకర పోయ్యే ప్రమాదం ఉంది. నీటి శుద్ధి కేంద్రాల్లో తయారు చేసిన నీటిని బబుల్స్, సింథటిక్స్ ట్యాంకుల్లో నింపి ఆటోల్లో మున్సిపాలిటీ అంత అమ్మకాలు చేస్తున్నారు.

గోవధ నిషేధ చట్టం అమలు చేయాలి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న గాలి హరిప్రసాద్, తదితరులు

వేంపల్లె : పట్టణంలో గోవధ నిషేధ చట్టం అమలు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ కోరారు. శనివారం పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోవులలో సకల దేవతలు కొలువై ఉన్నారని శాస్త్రాలు చెబుతున్నాయన్నారు. అలాంటి శాస్త్రాలను హిందూ సమాజం పాటిస్తూ వస్తోందన్నారు. గోహత్య మహాపాతకమని, గోవుల అక్రమ రవాణా, గోవధ పశుసంరక్షణ చట్టం 1977 ప్రకారం ఏ ప్రాంతంలో కూడా గోవులను వధించడం అక్రమంగా తరలించడం వంటి పనులు చేయకూడదనే ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. సదరు ఆదేశాలు పట్టణంలో అమలు పరిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. హిందువుల మనోభావాలను గౌరవించాలని అధికారులను కోరామన్నారు. రానున్న బక్రీదు పండుగ దృష్ట్యా గోవధలాంటి చర్యలకు ఎవరూ పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ పద్ధతిలో కూరగాయల సాగు



సేంద్రీయ పద్ధతిలో కూరగాయలను సాగుచేస్తున్న రైతు

తొండూరు : మండలంలోని గంగాదేవిపల్లె గ్రామ రైతులు సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు సాగుచేస్తున్నారు. ఎరువులు, పురుగుల మందులతో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడంతో రోజురోజుకు అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. తద్వారా అందరి దృష్టి సేంద్రీయ వ్యవసాయంపై పడింది. రసాయనాలు లేని వ్యవసాయ ఉత్పత్తుల కోసం అనేక మంది రైతులు ప్రకృతి వ్యవసాయం అవలంభిస్తున్నారు. భూమిలో ఎరువులు, పురుగుల మందులు వాడకుండా ప్రకృతి సిద్ధంగా పంటలు పండిస్తూ సొంత మార్కెటింగ్‌తో లాభాలబాట పట్టారు. మండలంలో అధిక సంఖ్యలో గంగాదేవిపల్లె గ్రామంలో రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారు.

ఆడపిల్లలను కాపాడుకుందాం



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

జమ్మలమడుగు : ఆడపిల్లలను కాపాడుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ తెలిపారు. శనివారం పట్టణంలోని శంకర్ నర్సింగ్ హోం ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్కానింగ్ రూంలో జరుగుతన్న స్కానింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కడుపులో ఆడపిల్ల పెరుగుతుందని చాలా మంది గర్భస్థ శిశువులను అబార్షన్ ద్వారా తొలగిస్తున్నారని అలాంటి వారు ఎవరైనా ఆసుపత్రికి వస్తే వారికి వైద్యులు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. వైద్యులు స్కానింగ్‌లో చేసి లింగ నిర్ధారణ చేయడం చట్ట రీత్యానేరం అవుతుందన్నారు. వైద్యులు లింగ నిర్ధారణ చేసినట్లు అయితే వారికి జైలు శిక్షతోపాటు సర్టిఫికేట్‌లను రద్దుచేస్తారని హెచ్చరించారు.

ఏపీ మోడల్ స్కూల్లో దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు : మండల పరిధిలోని గంగాయపల్లెలో వున్న ఏపీ మోడల్ స్కూల్లో 7, 8, 9 తరగతుల్లో ఇంగ్లీషు మీడియంలో ఖాళీగా వున్న సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతిలో 18 సీట్లు, 8వ తరగతిలో 3 సీట్లు, 9వ తరగతిలో ఒక సీటు ఖాళీగా వుందని తెలిపారు. అర్హత గలిగి ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 21వ తేదీ లోపు పాఠశాలలో స్వయంగా తమ దరఖాస్తులను అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 23వ తేదీన స్థానిక పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తారన్నారు. పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్‌లను అనుసరించి సీట్లు కేటాయిస్తారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సమస్యల పరిష్కారానికే లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి భార్గవి

ముద్దనూరు : ఇరు వర్గాల మధ్య నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్‌ను వేదికగా వినియోగించుకోవాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి మెజిస్ట్రేట్ భార్గవి తెలిపారు. శనివారం మండలంలోని కొత్తపల్లెలో ఆమె న్యాయ విజాన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఈనెల 29వ తేదీన లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్టాలపై అవగాహన కల్పించడానికే న్యాయ వ్యవస్థ ప్రజల ముందుకు వచ్చిందన్నారు. చిన్నసమస్యలను పెద్ద మనుషుల ద్వారా పరిష్కరించుకోవాలని, భూముల క్రయవిక్రయాలలో మోసాలను గ్రహించాలని జడ్జి సూచించారు. కార్యక్రమంలో సీఐ దస్తగిరి, ఎంపీడీవో చంద్రమౌళి, డిప్యూటీ తహసీల్దారు సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలకు శిక్షణతో కూడిన సర్టిఫికెట్ ఇవ్వాలి

కడప కార్పొరేషన్: ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇచ్చి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆర్‌ఎంపీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. శనివారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆర్‌ఎంపీలకు తగిన శిక్షణ ఇచ్చి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇస్తామని జీవో నంబర్ 465 జారీ చేశారని, ఆయన మరణానంతరం ముఖ్యమంత్రి అయిన నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వం ఆర్‌ఎంపీలకు శిక్షణ అయితే ఇచ్చారుగానీ పరీక్షలు నిర్వహించలేదన్నారు. కొత్తగా ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వం ఆర్‌ఎంపీలకు శిక్షణ పూర్తయిన వారికి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే శిక్షణ తీసుకోని ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇచ్చి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ విషయమై త్వరలో ముఖ్యమంత్రితోపాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులను కలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో బిల్లులు నిలిపేయండి

అధికారులకు ఎమ్మెల్యే వరద లేఖ

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను నిలిపివేయాలని టీడీపీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మండల పరిషత్ అధికారులకు లేఖ రాశారు. 2019 నుంచి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులపై విజిలెన్స్ అధికారులతో విచారణ చేయిస్తానన్నారు. అప్పటి వరకు పంచాయతీల్లో కొత్తగా చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించి ఎస్టేమేట్స్, కొటేషన్లు ఇవ్వొద్దని అధికారులకు సూచించారు.

వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను టార్గెట్‌గా చేసుకుని ఎమ్మెల్యే ఈ విధంగా లేఖ రాసినట్లు తెలుస్తోంది. ప్రొద్దుటూరు మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు సంబంధించి మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు మెజారిటీ గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీ నేతలే ఉన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 రోజులు కాక మునుపే టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేశారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఇంకా ప్రమాణ స్వీకారం కూడా చేయకపోవడం గమనార్హం.

అక్రమాలపై విచారణ జరపాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నీట్ పరీక్ష ఫలితాల అక్రమాలపై విచారణ జరపాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాలెం హరి ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నీట్ విద్యార్థులు దాదాపు 25 లక్షల మంది పరీక్షలు రాస్తే అందులో 63 మందికి దాదాపు 720 /720 మార్కులు రావడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. పేద, బడుగు, బలహీన విద్యార్థులను మోసం చేసి బడా బాబుల విద్యార్థులకు బీజేపీ ప్రభుత్వం అమ్ముడు పోయిందని విమర్శించారు.

వృద్ధుడికి అంతిమ సంస్కారాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అమ్మానాన్న వృద్ధాశ్రమంలో శనివారం ఒంటేరు నారాయణ అనే వృద్ధుడు మృతి చెందాడు. అంతిమ సంస్కారాలు చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో వృద్ధాశ్రమం నిర్వాహకులు మే ఐహెల్ప్‌యూ ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మణరావుకు సంప్రదించారు. దీంతో వృద్ధుని మృతదేహానికి హిందూ స్మశాన వాటికలో ఫౌండేషన్ చైర్మన్‌తో పాటు భార్గవ్‌సాయి, సుబహాన్, మునేంద్ర, కృప, ఫరూన్, లక్ష్మమ్మ తదితరులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

రిమ్స్‌లో రక్తదానం

కడప అర్బన్: అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌ఐ) కడప బ్రాంచ్ సెక్రటరీ డాక్టర్ టి. గిరిధర్ ఆధ్వర్యంలో కడప బ్లడ్ బ్యాంక్‌లో కడప రిమ్స్, ఫాతిమా మెడికల్ వైద్య కళాశాల వైద్యులు, వైద్య విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. 32 యూనిట్ల రక్తదానం చేసి తమ మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్ర, రిమ్స్ అనస్థీషియా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బద్రి శ్రీనివాసులు, డాక్టర్స్ అమానుల్లా, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ సాదిక్, డాక్టర్ మధుసూదన్, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. **కడప కోటిరెడ్డిసర్కిల్** : అంగన్వాడీ కార్యకర్తలు అన్ని అంశాల్లో అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని శిశుగృహ మేనేజర్ కుమారి తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో నగరంలోని కొండాయపల్లెలోగల మోడల్ అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుమారి మాట్లాడుతూ దత్తత కార్యక్రమాన్ని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ద్వారా నిర్వహించడం జరుగుతోందన్నారు. పిల్లలు లేని వారికి దత్తత అనేది ఒక వరం లాటిందన్నారు. అటువంటి వరాన్ని ప్రభుత్వం అందించడం సంతోషదాయకమన్నారు. చిన్నారులను నియమ నిబంధనల ప్రకారం చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని ఆమె సూచించారు. ఎస్ఐసీ ప్రొటెక్షన్ ఆఫీసర్ కృష్ణ ప్రతిరూప్ మాట్లాడుతూ బాలల న్యాయ చట్టం గురించి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబుచాన్ మాట్లాడుతూ పిల్లలు పౌష్టికాహారం తీసుకోవడంద్వారా శారీరక, మానసిక ఎదుగుదల జరుగుతుందన్నారు.

వైభవంగా తిరునాల ఉత్సవాలు



తిరునాలలో బండలాగుతున్న ఎద్దులు

పెండ్లిమర్రి : మండలంలోని కారపురెడ్డిపల్లెలో వెలసిన శ్రీ కొత్తగంగమ్మ తిరునాల ఉత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, ఆకు పూజ, పంచామృతాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కాయకర్పూరాలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అవరణలో కోలాటం, అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీల్లో గెలుపొందిన ఎద్దులకు ఆలయ నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

అంగరంగ వైభవంగా పుష్పయాగం



బద్వేలు అర్బన్ : స్వామి, అమ్మవార్లకు చక్రస్నానం నిర్వహిస్తున్న వేద పండితులు



బద్వేలు అర్బన్ : స్వామి, అమ్మవార్లకు అశ్వవాహనసేవ నిర్వహిస్తున్న భక్తులు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండావధూతాశ్రమం గోవిందయ్య మఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆరు రోజులుగా జరుగుతున్న ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం మహాపూర్ణాహుతి నిర్వహించి స్వామి, అమ్మవార్లను అశ్వవాహనంపై ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించి శాస్త్రోక్తంగా చక్రస్నానం చేయించారు. సాయంత్రం ధ్వజావరోహణం కార్యక్రమం నిర్వహించి అనంతరం ఆలయంలో అంగరంగ వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. అందులో భాగంగా వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డివెంకటరామిరెడ్డి, దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి సి.శివయ్య, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రతనాల వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రత్యేక అలంకరణలో రతనాల వేంకటేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున వెంకటేశ్వరస్వామి మూలవిరాట్‌కు విశేష పూజలతో పాటు, శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితాదేవి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేసి కర్పూర హారతులు ఇచ్చారు. భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జేష్ఠ మాసం రెండవ శనివారం సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు.

కష్టజీవుల ఐక్యత కోరిన శ్రీశ్రీ



మాట్లాడుతున్న ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి

కడప కల్చరల్ : కష్టజీవుల ఐక్యత కోరిన సుప్రసిద్ధ కవి శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) అని యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. సాహితీ స్రవంతి సంస్థ ఆధ్వర్యంలో శనివారం శ్రీశ్రీ వర్ధంతి సభను స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించారు. సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లా కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య ఈశ్వర్‌రెడ్డి శ్రీశ్రీ కవిత్వం, సమకాలీనత అనే అంశంపై మాట్లాడారు. శ్రీశ్రీ కవిత్వం కార్మికులకు మార్చింగ్ బ్యాండ్‌లాగా పనిచేస్తుందన్నారు. నన్నయ, తిక్కన, ఎర్రన తెలుగు కవిత్రయం కాదని, ప్రస్తుత తరుణంలో శ్రీశ్రీ, వేమన, గురజాడలే కవిత్రయమన్నారు. రాజకీయాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు నేటికీ నూతనంగా ఉన్నాయన్నారు. సాహితీవేత్త డాక్టర్ పొదిలి నాగరాజు మాట్లాడుతూ శ్రీశ్రీ కథలు కష్టజీవుల గురించే ఉన్నాయని, ఆయన డిటెక్టివ్ కథలు కూడా రాశారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కవులు తమ కవితలను వినిపించారు. వారందరికీ నిర్వాహకులు ప్రత్యేక బహుమతులు అందజేశారు. జన విజ్ఞాన వేదిక మహిళా నేత సునీత, రచయిత్రి అరుణ, సీపీఎం నాయకులు దస్తగిరి, రామ్మోహన్, సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ ప్రసాద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువతకు చైతన్య స్ఫూర్తి శ్రీశ్రీ రచనలు



శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: యువతకు చైతన్య స్ఫూర్తి శ్రీ శ్రీ రచనలు అని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. శనివారం శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా నగరంలోని నిహార్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ రచనలు ఉత్తేజ భరితంగా, శ్రామిక వర్గానికి దగ్గరగా.. ముఖ్యంగా యువతను కదిలించే విధంగా ఉన్నాయన్నారు. అందుకే ఆయనను విప్లవ కవి అని కూడా అంటారన్నారు. ఆయన రచనలు చదివి ఎందరో స్ఫూర్తి పొందారని, ఇప్పటికీ పొందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా రాష్ట్ర హక్కులైన విభజన హామీలు అయిన ప్రత్యేక హోదా, కడప ఉక్కు పరిశ్రమ, వెనుకబడిన రాయలసీమకు ప్యాకేజీ వంటి సాధన కోసం కృషి చేయాలని, కేంద్రంపై ఆ విధంగా ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నామన్నారు.